క్లుప్తంగా

పంచరామాలకు ప్రత్యేక బస్సు సర్వీసు



నర్సంపేట : స్థానిక ఆర్టీసీ డిపో నుంచి పంచ రామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటకు 36 సీట్లు గల సూపర్ లగ్జరీ బస్సును డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పంచరామాలకు వెళ్లే భక్తులు బస్సు సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్, డిపో ట్రాఫిక్ సూపర్ వైజర్ సత్య నారాయణ, నర్సింగరావు, రాజు, ఏడీసీలు సాంబయ్య, ఖలీల్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



నర్సంపేట : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అంగడి రోడ్‌లో ఇందూ జ్ఞాన వేదిక వరంగల్ కమిటీ సభ్యులు ఆదివాకం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు ఓంప్రకాశ్ ఆచారి మాట్లాడారు. కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం ద్వారా అందులోని జ్ఞానాన్ని తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు కిరణ్‌చారి, శంకర్, రావణ్‌చారి, విక్రమ్, నిర్మల, లైత్రీ, అక్షయ, శశిరేఖ, రోహిణి, నిర్మల పాల్గొన్నారు.

సన్మానం



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్ధేశ్వర ఆలయంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులను ఆదివారం సన్మానించారు. అనంతరం వృద్ధులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య, గౌరవ అధ్యక్షుడు వరంగంటి మల్లయ్య, కోశాధికారి వరంగంటి కుమారస్వామి, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జున్నుతుల రాంరెడ్డి, తాళ్లపెల్లి కొమ్మాలు, తిరుపతిరెడ్డి, గట్ల కృష్ణయ్య, అడప సత్తయ్య, ఆనందం, జర్నలిస్టులు మహద్ అబ్దుల్ వహీద్, బొనగాల రమేశ్, ఆకుల అశోక్, కాసుల రామ్మోహన్ చారి, పాలడుగుల దేవరాజు, ముత్యం రాజు, కరుణాకర్, అల్వాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నివాళి



నర్సంపేట : పట్టణానికి చెందిన నాళం పుల్లయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్ రావు, టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పుల్లయ్య కుమారుడైన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాళం విజయ్‌కుమార్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అనుబంధ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ముత్తినేని వెంకన్న, మాజీ కౌన్సిలర్ మెరుగు సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని కేశవాపురం ఈదులతండాకు చెందిన అనిత కుమార్తె మీనాక్షి అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్‌లోని ఎంజీఎంలో చికిత్స పొందుతుండగా వైద్యం కోసం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి రూ.5 వేల సాయం అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డి పంపిన డబ్బును అనితకు ఫౌండేషన్ ప్రతినిధి, తెలంగాణ ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ నాయక్ రాథోడ్ ఎంజీఎంలో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు శ్రీధర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇనగాల ట్రస్టు ఆధ్వర్యంలో..

గీసుకొండ : మండలంలోని ఆరెపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ తండ్రి శంకర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శ్రీనివాస్‌కు ఇనగాల ట్రస్టు ఆధ్వర్యంలో నగదు సాయం అందజేశారు. కార్యక్రమంలో ఇనగాల టీం సభ్యులు ఆరకట్ల సాయి, జన్ను రమేశ్, వివేక్, మహ్మద్ జావిద్, నర్సింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

వరికొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు

- భూమిలోని పోషకాలపై దుష్ప్రభావం
- పొగతో వాయు కాలుష్యం

సంగెం : వరికొయ్యల దహనం.. భూసార హననమే. రైతుల అవగాహన రాహిత్యంతో వరికొయ్యలను, పంట అవశేషాలను దహనం చేస్తున్నారు. వరికొయ్యలను దహనం చేయడం వల్ల భూసారానికి తీరని నష్టం వాటిల్లుతుంది. భూమిలో పోషకాలు తగ్గిపోయి దిగుబడిపై దుష్ప్రభావం పడుతుంది. పంటకు మేలు చేసే పోషకాలు నైట్రోజన్, పాస్ఫరస్, పొటాషియం మంట వేడికి ఆవిరై భవిష్యత్‌లో పంటల ఉత్పాదకాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. వరికొయ్యలకు నిప్పు పెట్టడం వల్ల కలిగే అనర్థాలను వ్యవసాయాధికారులు రైతులకు వివరిస్తున్నారు.

మండలంలో వ్యవసాయ సాగుకు అనువైన భూమి 13 వేల 960 హెక్టార్లు ఉన్నది. ఇందులో 2 వేల 550 హెక్టార్లలో వరి సాగు అవుతోంది. వరికొయ్యలతోపాటుగా యంత్రాలతో కోసిన వరిగడ్డిని సైతం కొందరు రైతులు తొలగించలేక కాల్చివేస్తున్నారు. ఈ కారణంగా భూసారం దెబ్బతినడంతో పాటు వాయు కాలుష్యం చోటు చేసుకుని ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. వరి కొయ్యలను కాల్చితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఢిల్లీ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో వరికొయ్యలకు నిప్పు పెట్టడంతో వాయు కాలుష్యం చోటు చేసుకుని ప్రజలు ఆక్సిజన్ అందక ఇబ్బంది పడుతుండగా, పాఠశాలలకు సైతం సెలవులు ఇవ్వడం, సరి–బేసి సంఖ్యలో వాహనాలు నడపడం వంటి చర్యలకు ప్రభుత్వాలు ఉపక్రమించిన పరిస్థితి తెలిసిందే. ఇలాంటి దుస్థితి మనకు రాకుండా ముందస్తుగా వరికొయ్యలను కాల్చవద్దని హెచ్చరిస్తున్నారు.



పొలంలో కాలుతున్న వరి కొయ్యలు

వరికొయ్యలను కాల్చడంతో కలిగే నష్టాలు

నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి పోషకాలు ఆవిరైపోతాయి. భూమిలోని సూక్ష్మజీవులు నశించి భూమి సమతుల్యత కోల్పోతుంది. వాయు కాలుష్యం పెరిగి ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. మట్టిలోని నీటి నిల్వ సామర్థ్యం తగ్గి పంటకు అధిక నీటి అవసరం ఏర్పడుతుంది.

వరికొయ్యలను కలియదున్నడంతో..

వరికొయ్యలను భూమిలో కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది. వరి కోసిన తర్వాత ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ), 10–15 కిలోల యూరియాను వరికొయ్యలపై చల్లి నీటిని పెడితే కొయ్యలు కుళ్లిపోతాయి. అనంతరం రోటీవేటర్‌తో కలియదున్నితే సల్ఫర్, భాస్వరం పోషకాలు విడుదలై మొక్కల ఎదుగుదలకు దోహదపడుతాయి. మట్టిలో జీవం పెరిగి ఉత్పాదకత మెరగవడంతోపాటు రసాయక ఎరువుల వాడకం, ఖర్చు తగ్గుతాయి.

వరికొయ్యలను కలియదున్నాలి



వరికొయ్యలు, పత్తికట్టె అవశేషాలను తగలబెట్టడంతో భూమికి తీరని నష్టం వాటిల్లితుంది. భవిష్యత్‌లో పంటల దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉంది. వాయు కాలుష్యం తలెత్తి ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుంది. వరికొయ్యలను, పత్తికట్టె అవశేషాలను కాల్చకుండా దుక్కిలో కలియదున్నితే సేంద్రియ ఎరువు తయారై భూమికి మేలు కలుగుతుంది.

-సీహెచ్.యాకయ్య, ఏఓ

వరికోయ్యలను మల్చింగ్‌గా వాడితే భూమిలో తేమ పెరిగి మొక్కకు అనుకూలత లభిస్తుంది.

సకాలంలో డేటా ఎంట్రీ పూర్తి చేయాలి

- జెడ్పీ సీఈఓ రాంరెడ్డి



నర్సంపేట రూరల్ : డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న సీఈఓ రాంరెడ్డి

నర్సంపేట రూరల్/దుగ్గొండి : సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, కులగణన సమగ్ర సర్వే డేటా ఎంట్రీని సకాలంలో పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ రాంరెడ్డి ఆదేశించారు. నర్సంపేట, దుగ్గొండి మండల పరిషత్ కార్యాలయాల్లో డేటా ఎంట్రీని ఆదివారం ఆయన సందర్శించి ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సూపర్‌వైజర్లు ఎన్యుమరేటర్లతో సమన్వయం చేసుకుని వివరాలను నమోదు చేసే క్రమంలో ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని సూచించారు. తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వివరాల నమోదులో నిర్లక్ష్యం చేయొద్దని స్పష్టం చేశారు. ఫారాలన్నిటినీ భద్రపర్చాలని చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓలు శ్రీనివాస రావు, లెక్కల అరుంధతి, తహసీల్దార్ రవిచంద్రా రెడ్డి, ఎంపీఓలు రామ్మోహన్, శ్రీధర్, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



నెక్కొండ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి, సంపత్‌రావు



ఖానాపురం : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే పంట ఉత్పత్తులకు మద్దతు ధర లభిస్తుందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, రెడ్లవాడ పీఏసీఎస్ చైర్మన్ జలగం సంపత్‌రావు తెలిపారు. మండలంలోని రెడ్లవాడ పీఏసీఎస్ పరిధిలోని తోపనపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి సహకరించాలని కోరారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, పీఏసీఎస్, మార్కెట్ డైరెక్టర్లు కోరుకొండ యాకయ్య, మాదాసు సుధాకర్, మట్టె బాబు, కొత్తపల్లి రత్నం, బొమ్మెరబోయిన రమేశ్, రావుల మహిపాల్‌రెడ్డి, సీఈఓ జనార్ధన్, నాయకులు శ్రావణ్, వెంకన్న, పకీర్ మియా, ఉప్పలయ్య, నరేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డలో సమిష్టి రైతుమిత్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం బోనస్ కూడా అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల నాయకుడు ముస్తఫా, మాజీ సర్పంచ్ నర్సింహ, నాయకులు కమాలుద్దీన్, ఎల్లస్వామి, హరినాయక్, అశోక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



దుగ్గొండి : వంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్



పర్వతగిరి : వంటలను రుచి చూస్తున్న ఎంపీడీఓ



ఖానాపురం : మాట్లాడుతున్న తహసీల్దార్

దుగ్గొండి/ఖానాపురం/పర్వతగిరి : ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించాలని తహసీల్దార్లు రవిచంద్రారెడ్డి, కిరణ్‌కుమార్, ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ స్పష్టం చేశారు. దుగ్గొండి, ఖానాపురం, పర్వతగిరి మండలాల్లోని ఎంజేపీ, మోడల్ స్కూల్, ఎస్టీ బాలుర హైస్కూల్‌ను వారు వేర్వేరుగా ఆదివారం సందర్శించి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి నిర్వాహకులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని చెప్పారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



సంజయ్



విఘ్నేశ్

ఖానాపురం : మండలంలోని సైనిక్ స్కూల్ విద్యార్థులు సంజయ్, విఘ్నేశ్ వరుణ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ తెలిపారు. ఇద్దరు విద్యార్థులను స్కూల్ ఆవరణలో ఆదివారం ఆయన అభినందించి మాట్లాడారు. తైక్వాండో అండర్–19 విభాగంలో సంజయ్, ఖోఖో అండర్–17 విభాగంలో విఘ్నేశ్ వరుణ్ ఎంపికైనట్టు చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస స్వామి, ఉప్పలయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..



నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థి శీలం త్రినేశ్ అండర్–14 ఖో–ఖో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంఈఓ కొర్ర సారయ్య, ఎస్సై గూడ అరుణ్ స్కూల్ ఆవరణలో ఆదివారం అభినందించారు. అనంతరం ఎంఈఓ సారయ్య, ఎస్సై అరుణ్ మాట్లాడారు. త్రినేశ్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం త్రినేశ్‌తోపాటు ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) కోట రాంబాబులను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లడానికి అయ్యే ప్రయాణ ఖర్చుల కోసం త్రినేశ్‌కు రిటైర్డ్ తెలుగు పండిట్ కృష్ణారావు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, శ్రీనివాస్, అబిద తబస్సుం, ఉమామహేశ్వర్, రవికుమార్, గోపాల్‌రావు, భిక్షపతి, బుచ్చిరాములు, బాల, శైలజ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో బంగారు భవిష్యత్‌కు బాటలు



ఎన్‌సీసీ కేడెట్లతో ప్రిన్సిపాల్, ఆఫీసర్, తదితరులు

- ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్

నర్సంపేట రూరల్ : ఎన్‌సీసీతో విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు పడతాయని బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్‌సీసీ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్‌సీసీలో పాల్గొంటే రక్షణ శాఖలో ఉద్యోగాలు సాధించవచ్చని, ఉన్నత విద్యా రంగంలో రిజర్వేషన్లకు అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు. సామాజిక బాధ్యత, దేశభక్తి పెరుగుతాయని వివరించారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. దేశభక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ రియాజుద్దీన్, భవానీ చంద్, ప్రదీప్, వినోద్, శ్రీకాంత్, రాజేశ్, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి అభిషేక పూజలు



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మహేశ్, తదితరులు

నర్సంపేట : పట్టణంలోని ఆలయంలో అయ్యప్ప స్వామికి అర్చకులు తివారి అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా ఆధ్వర్యంలో గట్టు మహేశ్ బాబు, ఎస్‌కె పాషా ఆగ్రో ఇండస్ట్రీస్ అధినేత, నీలం వెంకటేశ్వర్లు అరుణ, సాయిశ్రీ హాస్పిటల్, డాక్టర్ ధారావత్ రామచందర్, డాక్టర్ హైమావతి ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సైఫ సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మి నారాయణ, రాజశేఖర్, బండారుపల్లి చెంచారావు, బీరం రవీందర్‌రెడ్డి, శ్రీరాం కిరణ్, పాలకుర్తి శ్రీనివాస్, వజినపల్లి శ్రీను, అనంతుల రాము, శ్రీరాముల శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- టీయూఎఫ్ జిల్లా అధ్యక్షులు రజనీకాంత్

గీసుకొండ/సంగెం : తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) జిల్లా అధ్యక్షుడు నందగిరి రజనీకాంత్ ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 27, 28 తేదీల్లో కరీంనగర్ నుంచి వేములవాడకు తలపెట్టిన పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను గీసుకొండ, సంగెం మండల కేంద్రాల్లో ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారిని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా తాత్సారం చేస్తోందని చెప్పారు. ఉద్యమకారులకు నెలకు రూ. 25 వేల పింఛన్, 250 గజాల ఇంటి స్థలం, తదితర హామీలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం మండల అధ్యక్షులు ఆడెపు రమేశ్, వేల్పుల యాదగిరి, నాయకులు నర్మెట యాదగిరి, యార బాలకృష్ణ, జన్ను రాజు, కోర్నెల్, చేరాలు, ఉమా మహేశ్వరి, శరత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బాబు

నెక్కొండ : ప్రజాసమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపెల్లి బాబు అన్నారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక విస్మరించాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ మోసపూరిత చట్టాలను తీసుకొచ్చి రైతుల ఉసురు తీస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి ప్రజలకు నష్టం చేసిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ ఏరియా కార్యదర్శి నమిండ్ల స్వామి, నాయకులు పరికి మధుకర్, మొగులోజు శారద, భూపాల్‌రెడ్డి, నరేశ్, రవి, యాకోబ్, రమేశ్, జనార్ధన్ పాల్గొన్నారు.

'జాతీయ జెండాపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి'

వర్ధన్నపేట : జాతీయ జెండాపై డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ ఫొటో ముద్రించి పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని, పార్లమెంట్ ఎదుట 205 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి కోరారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కోసం డిసెంబర్ 15న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు కంజర్ల సమ్మయ్య, గబ్బెట బాబు, ఆనందం, చినపెల్లి బాబు, మనోహర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణ చేయకపోతే గుణపాఠం తప్పదు'

వర్ధన్నపేట : సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేయకపోతే గుణపాఠం తప్పదని మాదిగల ఐక్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను నర్సయ్య అన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వర్గీకరణను కొందరు ఎమ్మెల్యేలు వ్యతిరేకించి మాల మాదిగ కులాల మధ్య చిచ్చు పెడుతుండగా వారిపై అధిష్టానం చర్యలు తీసుకోలేదన్నారు. సమావేశంలో నాయకులు మరుపట్ల అంజయ్య, మారెపెల్లి ఎల్లయ్య, చంద్రమౌళి, మామిండ్ల చంద్రయ్య, తూల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి'



గీసుకొండ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాలోతు సాగర్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు తొగటి బ్రహ్మాచారి, గోరుకంటి రమేశ్, దుపాకి రాజు, గుండ రమేశ్, ఇప్ప శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

'వివేకానందుడి విగ్రహ తొలగింపును అడ్డుకుంటాం'

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని స్వామి వివేకానంద విగ్రహ తొలగించడానికి యత్నిస్తే అడ్డుకుంటామని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా కార్యదర్శి మల్యాల రవి తెలిపారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం స్వామి వివేకానంద విగ్రహాన్ని, పరిసరాలను ఆదివారం శుభ్రం చేసింది. అనంతరం స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. స్వామి వివేకానంద విగ్రహాన్ని తొలగించేందుకు గ్రామానికి చెందిన పార్వతి పరమేశ్వర రైస్‌మిల్ యజమాని సాత్విక్ గుప్తా యత్నిస్తున్నాడని ఆరోపించారు. స్వామి వివేకానంద విగ్రహాన్ని తొలగించేందుకు ఎవరు యత్నించినా తిప్పికొడగామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు బొల్లేటి జగదీశ్వర్, కార్యదర్శి వేల్పుల శ్రీధర్, సహ కార్యదర్శి ముసుకు రాజేందర్, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వేములపల్లి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెవ్వ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షుడు వరంగంటి సంతోశ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ననుమాస కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాయపర్తి : పూర్వఉపాధ్యాయులతో విద్యార్థులు



నల్లబెల్లి : రుద్రగూడెం హైస్కూల్‌లో..

రాయపర్తి : మండలంలోని మైలారం ప్రభుత్వ పాఠశాలలో 200–03 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము చదివిన పాఠశాలలో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనంద డోలికల్లో తేలియాడారు. సహపంక్తి భోజనాన్ని ఏర్పాటు చేసుకుని స్నేహితులతో కలిసి ఆరగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తమ వ్యక్తిగత, కుటుంబ పరిస్థితులను స్నేహితులతో పంచుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులైన వెంకట్రామన్, ఉప్పల్‌రెడ్డి, కొమురయ్య, భద్రయ్య, విజయ్, మీనలను ఆత్మీయంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ఆనంద్, కోల రాజు, అనంతుల ప్రవీణ్‌రెడ్డి, కోల నాగరాజు, కోల హరికృష్ణ, వీరన్న, సునీత, మంజుల, స్వప్న, జ్యోతి, రాణి, స్పందన, రత్నమాల, తదితరులు పాల్గొన్నారు.

రుద్రగూడెం హైస్కూల్‌లో..

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెంలోని హైస్కూల్‌లో 2007–08 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు స్కూల్ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బాల్యంలో విడిపోయి జీవితంలో స్థిరపడి సుమారు 16 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకుని సంతోషంగా గడిపారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులతో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరోజన దేవి, మరింగంటి వెంకట గిరిధరాచార్యులు, రామారావు, దయ్యాల సదయ్య, శాంసన్, మురళి, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పరిశీలన

ఖానాపురం : మండలంలోని పలు గ్రామాల్లో ఓటరు నమోదును తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఓటరు నమోదుకు చివరి రోజు కావడంతో పలువురు యువతీ, యువకులు దరఖాస్తు ఫారాలను అధికారులకు అందజేసారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ఓటు ద్వారానే మెరుగైన సమాజాన్ని నిర్మించగలమని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్‌ఐ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.